
# కౌశీబుగ్గ

ఈతకోట సుబ్బారావు

రూ. 10,000 మొదటి బహుమతి పొందిన కథ





**కాశీబుగ్గ... నల్లమల దట్టమైన అడవుల మధ్య రస్తాల వాసన సోకనంత దూరంగా విసిరేసినట్టున్న కుగ్రామం. ఆదివాసులనడానికి వీల్లేదు. కోయలనడానికీ అవకాశం లేదు. పల్లెలకీ పట్నాలకీ దూరంగా వున్నా, అది నాగరికత నీడ పడని వూరే. చిన్న పల్లెటూరు. పాతిక గడపలు దాటని చిన్న గ్రామం. సీతారాంపురం వెళ్లే తారు రోడ్డు కోసం తొమ్మిది కిలోమీటర్లు, ఎగువ మిట్ట రైలు మార్గం చేరుకోవడానికి పదమూడు కిలోమీటర్లూ చిట్టడవిలో అడ్డంగా నడవాలి. అదీ ఒంటరిగా నడవడానికి వీల్లేదు. నలుగురో, యే అయిదుమందో బృందంగా కలిసివెళ్లాలి. కర్రా, కత్తీ, బాణం, బరిసెల్లాంటివి ఆత్మరక్షణకి తీసుకెళ్లకపోతే చిరుతలు, తోడేళ్లు, ఎలుగుబంట్లు, నక్కల్లాంటివి వెంటపడి మరీ తరుముతుంటాయి.**

అడవిలో పాములకి కొరత లేకపోయినా వాగులు-వంకలూ దాటేటప్పుడు జెలగల కోసం కొరకంచులు అలుపూ సొలుపూ లేకుండా మండుతూనే వుండాలి. వాటి సెగకు అవి దూరంగా వెళ్లిపోతాయి. ఎన్ని ప్రమాదాల కత్తులు మొలిచినా కడుపాకలి తీర్చడానికి రోజూ అడవి బాటమ్మటా నడిచి మండల కేంద్రంలో కూలో నాలో వెతుక్కోవలసిందే. సంపాదించిన నాలుక్కాసులకి ఉప్పు, పప్పూ మూట కట్టుకొని చీకటి పడకముందే మళ్లీ అడవితల్లి వొడికి చేరుకోవలసిందే.

కాశీబుగ్గ మగాళ్ల దినచర్య సరే. ఆడాళ్లకి వూరి కొంపల్లోనే పడుంటే గడవదు. అడవికెళ్లి కర్రా పుల్లా యేరుకొస్తేనే గాని పొయ్యి వెలగదు. పిల్లల్ని వూళ్లో ముసలీ ముతకా జనం సంరక్షణలో వదిలేసి ఎండ పొద్దువేళ ఆడజనం అడవిలోకెళ్తుంటారు. వీలైనంత బిరాన పుల్లలేరుకొని తిరిగి గూడు చేరుకుంటూ వుంటారు.

వంటా-వార్పూ పూర్తయ్యాక ఆడమేళమంతా చేరేది ఆ పాతిక గుమ్మాలకి మధ్యన వందల సంవత్సరాల కిందట మొలిచిన పేద్ద మద్ది చెట్టు కిందకి. వొంగిన ఆ చెట్టు కొమ్మ ఒకదానికి పోపుల పెట్టెంత సైజులో ఓ ట్రాన్సిస్టరు వేలాడుతుంటుంది. దాంట్లో పలికేది ఒకే ఒక్క ఆకాశవాణి కేంద్రం. అదీ కడపది. ఆ లెక్కన ఆ వూరూ అక్కడి నల్లమల అడవి ప్రాంతం కడప పరిసర ప్రాంతానికి చెందింద్దై వుండొచ్చు.

ఓ ఏడాది క్రితం అర్ధరాత్రి వేళ వేటకోసం వచ్చిన ఒకానొక వేటగాడు అల్పపీడనం కారణంగా అడవిలో దారి తప్పి, ఆ వూరు చేరుకున్నాడు. ఆ వూరు తనకు ఆశ్రయమిచ్చి, ఆ రాత్రి కాపాడిన దాఖలాగా తన చేతిలోని ట్రాన్సిస్టర్ని బహుకరించి వెళ్లిపోయాడు. వెళ్తూ, వెళ్తూ ట్రాన్సిస్టర్ తాలుకూ వివరాలన్నీ చిందులుకి సవివరంగా వివరించి వెళ్లాడు. ఆ రోజు నుంచి సదరు చిందులు వూరి ఆడజనం కాలక్షేపం కొరకు దాన్నలా చెట్టుకి వేలాడదీశాడు.

కాశీబుగ్గలో అది ఎనిమిదో వింత.

కాని-

సదరు చిందులు ఆ రోజు వంట్లో నలత కారణంగా వూరి మగ సమూహంతో కలిసి కూలీపని కోసం ఇటు సీతారాంపురం కాని అటు ఎగువ మెట్టకాని వెళ్లలేదు.

''అదేంటి పెనిమిటీ! ఇట్లా పనికిపోక పోతివి. అట్లా నూకలు తేకపోతివి. పూట గడిసేదెట్లా?'' అని నిలదీసింది.

నిలదీయటమే కాదు ''ఇద్దరు పిల్లల్ని కంటివి. వాళ్లకి కూడెట్టవద్దా?'' అంటూ ప్రశ్నా కారం సంధించింది చిందులు పెళ్లాం తోకమ్మ. ''పిడికెడు నూకలు పక్కింట్ల అడిగి తేయే..'' అంటూ సలహా ఇచ్చాడు చిందులు.

ఆ పేర్లనీ, వాటి అర్థాలనీ గూర్చి అడక్కండి. ఎవరూ చెప్పలేరు. అంత పాండిత్యం ఆ వూళ్లో ఏ వయసు పైబడ్డ ముసలీముతక తరానికీ లేదు. ఆ పేర్లంతే. వాటి అర్థాలంతే.

చిందులు సలహా పాటించింది తోకమ్మ. ఆదెమ్మ ఇంట్లోంచి నూకలు తెచ్చి వండి వార్చి పిల్లలకి బువ్వ పెట్టింది తోకమ్మ.

''మరి నాకో..?'' అని చిందులు అడగలేదు.

''అడవిలో పుల్లలకి పోయి, ఆడ యే గడ్డలో పెరుక్క తిందాం'' అని తోకమ్మ బదులివ్వలేదు.

కుంటి కోలయ్య పాక వూరికి చివరగా వుంటుంది. అది గనక దాటితే అడవిలో పడ్డట్లే. అడవిలో వెళ్తున్నప్పుడు ఓ తోడేలు మీద పడి కోలయ్య పిక్కని నోట కరచుకెళ్లింది. ఆ రోజు నుండి ప్రాణాలతో బైటపడ్డ కోలయ్య కాస్తా కుంటి కోలయ్య అయ్యాడు. ఇప్పుడాయన వయసు అరవై ఐదు. పెళ్లాం పోయినేడాదే పుల్లలేరడానికి అడవికెళ్లి ఎలుగుబంటి దాడిలో ప్రాణాలు పొగొట్టుకుంది. నాలుగేళ్ల 'ముందటి'ని, మూడేళ్ళ 'ఎన్కటి'ని

కోలయ్య దగ్గర వొదిలిపెట్టి, తోకమ్మ, చిందులు అడవికెళ్లారు పుల్లల కోసం.

వెళ్తూ వెళ్తూ తోకమ్మ ''ఎప్పట్లానే పిల్కాయలు జాగర్త. యెల్ల దాట్తరేమో. సూపులుంచు'' అంటూ హెచ్చరికలు చేసి పిల్లలిద్దర్నీ కోలయ్యకి అప్పగించింది.

''పెనిమిటి పొట్ను యెల్తుంటువి. భూసెక్కిరం తవ్వుకురాయే తోకమ్మా!'' మనసులో చాన్నాళ్ళ బట్టి పీకుతున్న కోరిక అది.

''అట్టాగే దొరికితే పట్కొస్తా'' అంటూ హామీ ఒకటి అనాలోచితంగా ఇచ్చేసి దంపతులిద్దరూ నల్లమల యెల్ల దాటారు.

అప్పటికి సమయం పదకొండు కావస్తోంది.

అడవి బాటలు విచిత్రంగా వుంటాయి. తిన్నగా వెళ్తున్న కాలిదోవ ఫర్లాంగు దాటకుండానే అమాంతం ఐదు తొవ్వలుగా చీలిపోతుంది. బాగా అలవాటు పడ్డవాళ్లకి తప్ప యే తోవ ఎటువెళ్తుందో కొత్త బాటసారికి తెలియటం కొంచెం కష్టమే. ఎరుకలేనోళ్ల కాళ్ల దారి తప్పిపోతే చిందేరి మొక్క తొక్కి మాయలో పడిపోయారంటారు కాశీబుగ్గ జనం.

రోజూ బిక్కుబిక్కుమంటూ ఆడవాళ్లతో కలిసి భయంభయంగా అడవిలో దిక్కులు చూస్తూ నడిచేది తోకమ్మ. ఈ పూట భర్త వెంట నడుస్తుంటే తనకు బాగా మాలిమైన పులిని వెంటబెట్టుకొని నడుస్తున్నంత ధైర్యంగా వుంది. అడవి బాగా పరిచయం వున్న తోపులా అనిపించింది. కొండంత అండ తన నీడగా నడిచొస్తున్నట్టుంది. అదే ధైర్యంతో లోయలోకి దిగింది.

చిందులు భూ చెక్కర గడ్డ కోసం గుట్టలు తవ్వుతున్నాడు. తోకమ్మ ఎండుపుల్లలు పోగు చేస్తోంది. అడవిలో సాలచెట్ల నెత్తి మీది నుండి సూర్యుడు దూరంగా మలచాటుకి దిగిపోయే లోపల రెండు బరువైన మోపుల్ని ఆకాశతీగల పేనుడుతో కట్టకట్టింది.

''గెడ్ల తవ్వాట సాల్గాని, సూర్యుడు మాటు బడ్తుండు. సీకటి కమ్ముతావుంది. మోపెత్తుకో. ఎల్దాం'' భార్య మాట వినగానే ఆకాశం కేసి చూశాడు చిందులు. సూర్యుడు కనిపించట్లేదు. చెట్లనీడ చీకటిజాడలో సంగమిస్తున్నట్టనిపించింది.

''వస్తి.. వస్తి'' అంటూ గుట్టమీంచి కిందకి దూకాడు చిందులు.

''మోపెత్తు'' అంది భర్త రాగానే. చిందులు ఒక మోపు తోకమ్మ నెత్తిన పెట్టి, రెండో కట్టెల మోపు తనెత్తుకున్నాడు.

''బిరాన పదే. సీకటై పోనాది'' అన్నాడు.

అప్పుడు కొద్దిగా వొళ్లు జలదరించినట్లైంది తోకమ్మకి. పైగా ఆ వేళకే ఎక్కణ్ణుంచో సన్నగా వూళ వినిపించింది. అయినా భయం పైకి కన్పించనీకుండా వేగంగా నడవడం మొదలెట్టింది. ఎంత వేగంగా నడిచినా భర్తకి వెనకబడే వుంది.

అడవి దారి. పైగా పల్చటి చీకటి తెర. దట్టమైన అడవిలో పైగా నిశ్శబ్దమే సర్వం వ్యాపించిన అడవిలో చీకటి వేళ ఎంతటి రాతి గుండెకైనా వణుకు పుట్టిస్తుంది. అంత పొద్దుగూకిందాకా తోకమ్మ ఏనాడు అడవిలో వుండిపోలేదు. అదే మొదటి అనుభవం. అయితే నెత్తి మీద మోపుకి చేతులు వూతంగా పట్టిన పెనిమిటి కండలు చూసి పిడికెడంత ధైర్యం గుండెలో కుమ్మరించినట్లైంది. దాంతో వేగం పెంచి భర్త అడుగుల్ని చేరుకునే ప్రయత్నం చేసింది తోకమ్మ.

చిందులుకి అడవి బాటలన్నీ కొట్టిన పిండే. అర్ధరాత్రి కళ్లకి గంతలు కట్టి నల్లమలలో వదిలేసినా క్షేమంగా ఇంటికి చేరుకోగలడు. అదే కారణం కావచ్చు, కాలిబాట వొదిలేసి గుట్టదారి పట్టాడు. తోకమ్మ కూడా భర్త మీది నమ్మకంతో అనుసరించింది. అది కొత్త దారే అన్పించినా అడుగులో అడుగు పడకుండానే మెట్ట దిగి కాశీబుగ్గలో కాలుపెట్టారు చిందులు, తోకమ్మలు.

''ఇంత బిరాన వచ్చినామే'' అంది తోకమ్మ వూళ్లో అడుగుపెట్టగానే.

''ఎవర్తో వస్తివి. సిందులుతో నడిత్తే నడిసి నట్టుండదే. యిగో.. ఈ గెడ్డలు కాల్చు. నేను బుర్రోళ్లని పిలుచుకొస్తా'' అంటూ మోపు గుడిసె ముందు దింపేసి కోలయ్య పాకకేసి నడిచాడు చిందులు.

తోకమ్మ చాటు తడిక పక్కకి తీసి గుడిసెలో కెళ్ళింది దీపం పెట్టడానికి.

* * *

చీకటి చిక్కనైపోయింది. నలుపు తెర మందమైపోయింది. అప్పుడే నల్లమలలోంచి దూరంగా నక్కల వూళలు వినిపిస్తున్నాయి. మద్ది చెట్టు కొమ్మకి వేలాడుతున్న ట్రాన్సిస్టరు వార్తలు వినిపిస్తుంది. చిందులు తవ్వి తెచ్చిన కావిరిగెడ్డలు కాలి వుడికిపోయాయి. వాటిని నిప్పుల్లోంచి బైటికి తీస్తున్నప్పుడు అసంకల్పితంగానే తోకమ్మ చెవి వార్తల వైపు మళ్లింది.

''ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న దురాశ, దయాకర్, రమణ, కృష్ణమూర్తి అనే ముగ్గురు యువకుల్ని హంతకులుగా మార్చేసింది. నాలుగేళ్ళయినా నిండని మేనమామ కూతురు మనీషని కిడ్నాప్ చేసి, అడిగిన డబ్బు ఇవ్వకపోయేసరికి ఆ ముగ్గురు



## నిర్మాతగా స్నేహ

సినీతారలు తాము సంపాదించిందంతా దేనిలో ఒకదానిలో పెట్టుబడి పెట్టడం సర్వసాధారణం. అయితే చాలా మంది తారలు బంగారు గుడ్లు పెట్టే రియల్ ఎస్టేట్ మీద తమ కష్టార్జితాన్ని పెట్టుబడి పెడుతుంటే స్నేహ మాత్రం తనకు ఉపాధి చూపించిన సినీ రంగంలోనే పెట్టాలని భావిస్తోందట. తన కష్టార్జితంలో కొంత భాగాన్ని రియల్ ఎస్టేట్‌లో పెట్టినా ఎక్కువ భాగాన్ని మాత్రం సినీ నిర్మాణ రంగంలో పెట్టడానికే మొగ్గు చూపుతోందట! లాభాల కోసం సినిమాలు తీయడం కాకుండా ఆత్మసంతృప్తిని ఇచ్చే సినిమాలు తీయాలని నిర్ణయించుకోవడం విశేషం. చిన్నపిల్లలు, మహిళా ఇతివృత్తాల మీద సినిమాలు నిర్మించాలన్న ఉద్దేశంలో వుందట. దీనికి సంబంధించిన పనులలో ఆమె సోదరి సహాయం తీసుకుంటోందట. స్వయంగా సినిమాలు నిర్మిస్తున్నా ఇతర బ్యానర్లలో నటించడం మాత్రం మానుకోవడంలేదు.

యువకులు పసిపాపను దారుణంగా గొంతు నులిమి చంపి, పాడుబడ్డ గోతిలో పడవేసి వెళ్లిపోయారు. హంతకుల కోసం పోలీసులు గాలింపును తీవ్రం చేశారు...''

ఆకాశ వాణిలో వార్తలు..అడవిలో జంతువుల అరుపులు..: చిమ్మ చీకటి... మరోపక్క గంట సేపైనా పిల్లల్ని తీసుకునిరాని పెనిమిటి... తోకమ్మకి ఎడమ కన్ను అదురుతున్నట్టనిపించింది. ఈ మానవుడు ఇప్పసారా కోసం సందులు కొట్టుకైతే వెళ్ళలేదు కదా అనుకుంది అనాలోచితంగానే. ఆ పాక వైపు నడిచింది తోకమ్మ పిల్లలకోసం.

కోలయ్య పాకకి తడిక అడ్డం పెట్టి వుంది. లోపల దీపం కూడా వెలగటం లేదు. పక్క కొట్టంలోకి దారి తీసింది తోకమ్మ.

''అత్తా!'' అంది బైట నుండే.

''ఏందే తోకీ! పిల్లగొండ్లు కన్పించినారా!'' సంకటి కలుపుతున్న చేతుల్తోనే లేచి వచ్చింది సుందత్త.

''ఏ పిల్లగొండ్లత్తా!'' పెదాలు వణికాయి.

''ముందటి, యెన్కట్లేనే..సందేల ఆడ్తా ఆడ్తా ఆడ నిలబడి పోయినారంట. వాండ్లని ఎత్కటానికి నీ పెనిమిటి కూడా పోయినాడు గంద'' అంటూ అంటూనే అడవికేసి చూసింది సుందత్త. అడవిలో మెట్లమీద కొరకంచులు కదులుతున్నాయి.

తోకమ్మకి విషయం అర్థమైపోయింది. గుండెలు అవిసిపోయాయి. మిట్టమీది కొరకంచుల్ని చూస్తున్న కళ్లలో కన్నీళ్లు తన్నుకొస్తున్నాయి.

''పట్నంలో మనుసులే మెకాలై పోతున్నరు. అడవి మెకాలకి కనికరం వుంటదా?''

జల జలా కళ్లు సెలయేర్లయ్యాయి తోకమ్మకి.

గుండె మీద ఎవరో నిప్పుకణిక పెట్టినట్టు ''సామయ్యా! నా పిల్లకాయలు..'' అంటూ గావుకేక పెట్టి ఏడ్పు లంకించుకుంది. తల్లి మనసు పడే వేదన వర్ణించడానికి అచ్చులు, హల్లులు, గుణింతాలు లోతు సరిపోదు.

నిజమే కావచ్చు. కాలం కంటే వేగంగా మారి పోతున్న సంస్కృతీ పరిణామాల నేపథ్యంలో, మనిషి అవసరాల కోసం క్షణం క్షణం మృగలక్షణాలకి దగ్గరవుతూ వుండవచ్చు. మృగంగా మారిపోతుండ వచ్చు. మృగం కంటే కర్కోటకంగాను ప్రవర్తించ వచ్చు. ఎందుకంటే మనిషిలో వున్న అలోచనా శక్తి కొవ్వొత్తి లాంటిది. కొవ్వొత్తిని ఏ చివరినుంచైనా వెలిగించొచ్చు. ఎటొచ్చీ ఒక చివర మానవత్వం, మరో చివర మృగత్వం కారాదు.

కాని అడవిలో మృగాల ఆలోచనా శక్తి వుండదు. పశువు పశువే. హింస దాని ప్రవృతి. అమ్మా-నాన్న కోసం నిరీక్షించీ సూర్యుడు కొండల చాటుకి వెళ్తుండగా నాలుగేళ్ల ముందటి, మూడేళ్ళ ఎన్కటి అడవిలోకి వెళ్లారు.

ఆకలి నకనకలాడుతున్న పచ్చి మృగాల అడవి. విషసర్పాల బుస గాలిలా హోరెత్తే అడవి. గుండెలేని అడవి.

గుండెలేని అడవి నుండి చిందులు తిరిగొచ్చాడు.

## రచయిత పరిచయం



పాతికేళ్ల సాహితీ సహవాసం, 1976లో సూళ్లూరుపేటలో ఇంటర్ చదువుకునే సమయంలోనే దేవులపల్లిగారిచే ఉత్తమ కవితా బహుమతి అందుకోవడం, 1979లో సినీ హెరాల్డ్ వారపత్రికలో 'అడుగుల భారం' మొదట కథ ప్రచురణ, దాదాపు 60-70 చిన్నాచితక కథలు యువ, జ్యోతి,స్వాతి, విజయ, నీలిమ, స్రవంతి, నవ్య, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, చినుకు తదితర పత్రికల్లో ప్రచురణ, 2006లో 'హృదయలిపి' కవితా సంపుటి 2007లో 'అక్షరానికో నమస్కారం' దీర్ఘ కవిత వెలువడడం, మొదటి కథ 'అడుగుల భారం' 1983లో ఉత్తమ కథగా యువలో, 2007లో తేజలో గోల్డెన్ స్టోరీగా పునఃప్రచురణ, దాదాపు 300 కవితలు పైగా వివిధ పత్రికలలో ప్రచురణ, ఆటా, రంజనీ కుందుర్తి, ఎక్స్‌రే, తెలుగు సమితి బరంపురం, కాళిదాసు కళానికేతన్ తదితర సంస్థల నుంచి ఉత్తమ, మంచి కవితలుగా బహుమతులు, నెల్లూరుజిల్లా ఇందుకూరు పేట, ఆన్‌లైన్ రిపోర్టర్‌గా ప్రవృత్తి.

- ఈతకోట సుబ్బారావు (నెల్లూరు)

అతడితో పాటు వెళ్లిన పాతికమంది మగాళ్లూ తిరిగొచ్చారు. కాని పిల్లలిద్దరు మాత్రం రాలేదు. ఏ నక్కల పాలబడ్డారో? ఏ చిరుతలెత్తుకు పోయాయో?

''పెనిమిటీ! నా పిల్లకాయలేరి...'' చిందులు గుండెల మీద వాలి కంటికి ధారగా ఏడ్చింది.

''వూకో... వూకో పొద్దుగాల్నే ఎదుకుదాం. అడవి తల్లి సంటి పిల్లకాయల జోలికెల్లదు..'' తోకమ్మని సముదాయించే ప్రయత్నం చేశాడు చిందులు.

తల్లి మనసు కుదుటపడలేదు. కన్న కడుపు మాటలతో, స్వాంతనలతో చల్లారలేదు. రాత్రంతా ఏడుస్తూ, వెక్కుతూ కునుకు మరిచి జాగారం చేసింది. క్షణంక్షణం నరకం అనుభవిస్తూ మేల్కొంది తోకమ్మ. ఆవిడ మొక్కుబళ్లే ఫలితం కాకపోయిన రాత్రి గడిచి తెల్లారింది.

అమ్మవారు పూనిందా అన్నంత ఆవేశంగా నిద్రపోతున్న భర్త పైన పడి రక్కుతున్నట్టుగా నిద్రలేపింది తెల్లారగట్టే తోకమ్మ. ''ఏహే..లెయ్యే... తెల్లారిపోనాది పిల్లకాయల్ని ఎదుకుదాం లెయ్యే..'' అంటూ హడావుడి చేసింది.

ఆమె కేకల్లాంటి మాటలకి వులిక్కిపడి నిద్ర లేచాడు చిందులు. అప్పటికే తోకమ్మ గుమ్మంలో ఠంచనుగా నిలబడివుంది అడవికేసి చూస్తూ.

గతరాత్రి తను వెళ్లిన తోవగుండా కాకుండా, తూర్పుబాట వైపుగా అడవిలోకి దారి తీశాడు చిందులు. తోకమ్మ అనుసరించింది. ఇద్దరూ ఎల్లదాటి, ఆ పైన మిట్ట దిగి, నక్కల కాలువ పక్కనుంచి గుట్ట పైకి చేరుకున్నారు. అక్కణ్ణుంచి అడవిని చాలా దూరం మేరా స్పష్టంగా చూడొచ్చు. అక్కడక్కడా చెట్లు దట్టంగా వున్న ప్రాంతాలు, పొదలు అల్లుకున్న మైదానాలు రెండో మూడో తప్ప మిగతా ప్రదేశమంతా స్పష్టాతిస్పష్టంగా కనిపిస్తుంది.

భార్యా భర్తలిద్దరూ నిశితంగా చూపు సారించారు. కనిపించిన ప్రతి అణువూ చూపుల సూదుల్తో గుచ్చారు.

ఎక్కడా పిల్లల జాడ కనిపించలేదు. తోకమ్మ కళ్లు కలువల చెరువైంది.

''నాకు..నా పిల్లకాయలు కావాలి..'' ఆవేశంగా మొగుడి చొక్కా పట్టి చింపేసింది తోకమ్మ.

చిందులేం మాట్లాడలేదు. ఆవిడలాగే మౌనంగా వున్నాడు. ఆ మౌనంలోంచే ఓ స్వచ్ఛమైన, అమాయక మైన, అందమైన చిన్ని నవ్వు వినిపించింది.

ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

ఆ నవ్వు వాళ్ల కాళ్ల కిందినించే. సరిగ్గా తమ వెనుకవైపు గుట్టకింద ఆ జానెడు రాతిబండపైన ముందటి, ఎన్కటి కూర్చొని వున్నారు. చెట్టెక్కి కూర్చున్న కోతి ఒకటి వాళ్లపైన అడవిపండ్లు విసురుతూంది. దాని చేష్టలకు పిల్లలిద్దరూ నవ్వుతున్నారు.

తోకమ్మకి సామయ్య మీద తొలిసారి నమ్మకం కుదిరింది. సామయ్య అంటే మద్ది చెట్టు కింద వాళ్లు పూజించే దేవుడి రాయి. సామయ్య కాపాడబట్టే అడవిలో రాత్రంతా పిల్లలు బతికి బట్టకట్టగలిగారు. ఏ తోడేళ్లూ వాళ్లని పీక్కు తినలేదు. ఏ చిరుతలు పంజా విసరలేదు. ఏ ఎలుగుబంటి చూపులు వాళ్ల మీద పడలేదు. సామయ్య దయ వుండబట్టే అంతా.

తోకమ్మ నమ్మకమే నిజమా? ఏమో? నాకు తెలిసి పిల్లలపైన లైంగిక దాడి చేసే అవలక్షణం అడవికి లేదు. స్వార్థ ప్రయోజనాల అత్యాశలో పడి ధనవంతుల బిడ్డల్ని కిడ్నాప్ చేసి డబ్బు సంపాదించు కోవాలనుకునే వక్ర బుద్ధి అడవికి లేదు. కిడ్నీలు, కళ్లూ అమ్ముకుని సొమ్ము చేసుకునే దుష్ట ఆలోచన అడవికి లేదు. అడవి ఎవర్నీ ద్వేషించదు. ప్రేమించని అమ్మాయిల ముఖాలపైన యాసిడ్ చల్లదు. నిలువునా పెట్రోలు పోసి సజీవ దహనం చేయదు. ఫ్యాక్షన్ కక్షలతో బాంబులు విసరదు. అందుకే ఆ పిల్లలిద్దరూ క్షేమంగా బతికున్నారు.

కాని జనారణ్యంలో పెరిగిపోతున్న క్రూర మృగాలని వేటాడడానికి ఎవరైనా మృగయా వినోది పుడతాడో, లేదో?

★